## క్లుప్తంగా

### వైఎస్సార్‌సీపీ విజయం కోసం మేరీమాతకు ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముందూరు సర్పంచ్ రాచూరి దేవిబాల తదితరులు

పెదవేగి : ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేగా కొఠారు అబ్బయ్యచౌదరి విజయం సాధించాలని ముందూరు సర్పంచ్ రాచూరి దేవి బాల మేరీమాతకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ముందూరు నుంచి బయలుదేరి సమల్‌దీవి మేరీ మాత పుణ్యక్షేత్రాన్ని దర్శించిన సర్పంచ్ కుటుంబ సభ్యులు పేదల పాలిట అండగా నిలిచే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అత్యంత మెజార్టీతో గెలవాలని దేవుని తల్లి మేరీమాతను, రక్షకుడైన ఏసుక్రీస్తు ప్రభువుకి ప్రార్థించారు.

### ఇరిగేషన్ చెరువులో మట్టి తవ్వకం



జోగన్నపాలెం ఇరిగేషన్ చెరువులో మట్టి తవ్వుతున్న దృశ్యం

దెందులూరు: జోగన్నపాలెం ఇరిగేషన్ చెరువులో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వుతున్నారని దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు ఆరోపించారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా జేసీబీతో మట్టి తవ్వి ట్రాక్టర్‌తో తీసుకువెళ్లడంపై రెవెన్యూ అధికారులకు జెడ్పీటీసీ ఫిర్యాదు చేశారు.

**మాజీ సర్పంచ్ ప్రభాకరరావు వివరణ**

జోగన్నపాలెం చెరువు నుంచి వ్యవసాయ సాగు నిమిత్తం తమ పొలంలోకి మట్టిని తీసుకువెళ్లామని జోగన్నపాలెం మాజీ సర్పంచ్ పసుమర్తి ప్రభాకరరావు అన్నారు. ఇప్పటి వరకు గ్రామంలో వ్యవసాయ పనుల నిమిత్తం రైతులు ఇదే చెరువు నుంచి మట్టిని తీసుకువెళ్లారని అన్నారు.

### 24న సాల్వేషన్ ఆర్మీ చర్చికి శంకుస్థాపన

దెందులూరు: దెందులూరులో ఈ నెల 24న నూతనంగా నిర్మించనున్న సాల్వేషన్ ఆర్మీ చర్చి పెద దళితపేట (ప్రస్తుత సాల్వేషన్ ఆర్మీ చర్చి) స్థలంలో శంకుస్థాపన జరుగుతుందని దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కే.రమణయ్య తెలిపారు. రిటైర్డ్ ఆఫీసర్లు, సంఘ పెద్దలు, సంఘస్తులు, గృహసమితి సభ్యులతో పాటు ఏలూరు డివిజనల్ కమాండర్ పాల్గొంటారన్నారు.

### విజ్ఞానం పెంచేలా వేసవి వినోద శిబిరాలు




వేసవి వినోద శిబిరం వద్ద బ్యానర్ ప్రదర్శన

ఏలూరు (టూటౌన్): విద్యార్థులకు వినోదం కూడిన విజ్ఞానం అందించే విధంగా హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ వేసవి వినోద శిబిరాలు నిర్వహిస్తున్నట్టు క్లబ్ కార్యదర్శి పి.దుర్గాప్రసాద్ తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ సెంటర్‌లోని బాలల గ్రంథాలయం వద్ద శనివారం నిర్వహించిన చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. ఏలూరు నగరంలో సుమారు 20 ప్రాంతాల్లో ఈ నెల 17 నుంచి వేసవి వినోద శిబిరాలను నిర్వహిస్తున్నామని, ఈ క్యాంపులు జూన్ మొదటి తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. ఏలూరులో ప్రతిచోటా సమ్మర్ హాలిడేస్‌లో విద్యార్థులకు అనేక అంశాల్లో తర్ఫీదు ఇస్తున్నట్టు చెప్పారు. ఆటలు, పాటలు, డాన్స్, చిత్రలేఖనం, లెక్కల్లో ట్రిక్కులు, దేశ జాతీయ నాయకుల జీవిత చరిత్రలు వీడియో ప్లే చేసి తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమాలకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం తదితర ప్రజా సంఘాలు సహకారం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ నిర్వాహకులు జి.శారద, ఉష అశ్విని, సీహెచ్ రాజేశ్వరి, యు.దుర్గ, ఎ.క్రాంతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఠాగూర్ రాజా, కె.లెనిన్, ఐద్వా జిల్లా అధ్యక్షులు పి.హైమావతి, పి.ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

### 30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరు రూరల్ : ఈ నెల 30న ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు తెలిపారు. ప్రతి మూడు నెలలకు సర్వసభ్య సమావేశం నిర్వహించాల్సి ఉందని, ఈ నిబంధన ఆధారంగా ఈ నెలాఖరులో సమావేశం ఏర్పాటుచేశామని చెప్పారు. సమావేశానికి ఎంపీటీసీలతో పాటు సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మండలధికారులు హాజరవుతారని తెలిపారు. సభ్యులు పాలనపరమైన అంశాలపైనే చర్చిస్తారని వివరించారు.

# దిశ యాప్‌తో మహిళలకు రక్షణ






దిశ యాప్ డౌన్‌లోడు పర్యవేక్షిస్తున్న పోలీసులు ( ఫైల్), మొబైల్ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన యాప్ ఓపెన్ చేస్తే కనిపించే ఎస్ఓఎస్ బటన్ నమూనా

- అత్యవసర వేళల్లో విద్యార్థులకు సాయం
- ఎస్ఓఎస్ బటన్ నొక్కితే సత్వరమే పోలీసుల సాయం
- పెదవేగి మండలంలో 8 వేల మందికి ఇన్‌స్టాల్

పెదవేగి : రాత్రి వేళ ప్రయాణంలో అనుమానాస్పద పరిస్థితులు, అత్తింటి వారి వేధింపులు. వీధిలో వెళ్తుంటే ఈవ్ టీజింగ్. సమస్య ఏదైనా మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో దిశ యాప్ ఉపయోగపడుతోంది. ఆపదలో ఉన్నవారు యాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే క్షణాల్లో పోలీసులు సహాయం పొందొచ్చు. దిశ యాప్ మహిళల రక్షణకు కవచంలా నిలుస్తోండగా దీనిని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీస్ అధికారులు పోలీసులు, సిబ్బంది వలంటీర్లు తమ ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, వాణిజ్య సముదాయాలు, సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద యాప్ పనితీరు, ఆపద సమయంలో ఎలా వినియోగించుకోవాలి. తదితర అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మహిళలు, విద్యార్థులను చైతన్యవంతులను చేసి వారి సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు.

**పనిచేస్తుంది ఇలా...**

దిశ యాప్‌లో ఐదు రకాల ఆప్షన్లుంటాయి. మధ్యలో ఎస్ఓఎస్ అని ఉంటుంది. అత్యవసర వేళల్లో సమయాల్లో ఎస్ఓఎస్ బటన్ నొక్కితే మీరు ప్రమాదంలో ఉన్నారని ఆ ఫోన్ లోకేషన్ వివరాలు దిశ కంట్రోల్ రూమ్‌కు వెళతాయి. ఎస్ఓఎస్ ప్రెస్ చేసే పరిస్థితి లేనిపక్షంలో ఫోన్‌ను గట్టిగా అటూ, ఇటూ ఊపితే చాలు ఆపదలో ఉన్నారన్న విషయం పోలీసులకు తెలిసిపోతుంది. ఈ యాప్‌లో డయల్ 100, డయల్ 112 నంబర్లను కూడా పొందుపరిచారు. సాయం కోసం ఈ నంబర్లకు సైతం ఫోన్ చేయొచ్చు.

**ప్రతి మహిళ చెంతకూ యాప్**



దిశ యాప్‌ను ప్రతి మహిళకు చేరువ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పెదవేగి మండలంలో ఇప్పటి వరకు సుమారు 8 వేలు మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. గృహిణులు, ఉద్యోగినులు, యువతులు యాప్ ద్వారా గృహహింస, అసభ్య దూషలు, బ్లాక్‌మెయిల్ తదితర ఆపదల నుంచి రక్షణ పొందుతున్నారు.

– కె శ్రీనివాసకుమార్, సీఐ, పెదవేగి

# విద్యార్థులంతా ఆత్మ విశ్వాసంతో చదవాలి



భీమడోలులో కలెక్టర్ శారన్ సందేశాన్ని విద్యార్థులకు చూపుతున్న దృశ్యం



నారాయణపురం జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

భీమడోలు: పదో తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన శనివారం ఆకస్మిక సందర్శించారు. ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సప్లిమెంటరీ పరీక్షలకు పూర్తిస్థాయిలో సంసిద్ధులయ్యారా అని విద్యార్థులను అడిగారు. విద్యార్థుల్లో మనోస్థైర్యాన్ని నింపేలా వారికి ఆయన మోటివేషన్ ప్రసంగాన్ని అందించారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బిలాస్‌ఫూర్ కలెక్టర్ శారన్ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లీష్, లెక్కలు, సైన్స్ సబ్జెక్టుల్లో ఫెయిల్ కాగా సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణ పొంది, ఆ తర్వాత ప్రేరణ పొంది దేశ అత్యున్నత పరీక్షగా గుర్తించిన యూపీఎస్సీ పరీక్షల్లో దేశ స్థాయిలో 13 ర్యాంకు సాధించి కలెక్టర్‌గా ఎంపిక అయ్యారని తెలిపారు. ఆయన పంపిన ఓ సందేశాత్మక మెసేజ్‌ను సెల్ ద్వారా విద్యార్థులకు చూపించారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల వల్ల కుంగిపోవద్దని, ఎవరూ ఒత్తిడికి గురి కావద్దని ఆయన తెలియజేయమన్నారని ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థులకు వివరించారు. చక్కగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలని కోరారు. విద్యార్థులు పరీక్షలంటే భయపడిపోవద్దన్నారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగితే లక్ష్యాలను చేధించడం తథ్యమన్నారు. ఈనెల 22న విద్యార్థులకు హాల్ టికెట్లను అందిస్తామని హెచ్ఎం బి.శ్రీనివాసరావు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డీఈవో ఎస్.అబ్రహాం, ఏపీసీ సోమశేఖర్, ఎంఈవోలు శ్రీనివాసరావు, భాస్కర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిశీలన**

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ మహాత్మా గాంధీ జూనియర్ కళాశాలను విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ శనివారం పరిశీలించారు. కళాశాలలో జరుగుతున్న అడ్మిషన్లు, వచ్చిన ఫలితాలు, నాడు - నేడులో పనుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో పలు అంశాలపై సమీక్షించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యాపకుల పాల్గొన్నారు.

# చదువుతో పాటు స్వీయ రక్షణ అవసరం



బాలికలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలికలకు చదువుతో పాటు స్వీయ రక్షణ అంశాల్లో మెళకువలూ అవసరమేనని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ మురళీకృష్ణ అన్నారు. హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ ) ఆధ్వర్యంలో ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన బాలికలకు స్వీయ రక్షణలో వేసవి ఉచిత శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం వైఎంహెచ్ఏ హాలు ప్రాంగణంలో బాలికలకు ప్రశంసా పత్రాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ బాలికలకు ఉపయోగకరమైన ఇటువంటి శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కోవడానికి ఉపయోగపడే స్వీయ రక్షణ, యోగ, ధ్యానం, ఓర్పు నేర్పుతో ఎలా ఉండాలనే శిక్షకుల ప్రసంగాలు బాలికల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. బాలికలకు ఆయా ఆత్మరక్షణ విద్యల్లో తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా హిందూ యువజన సంఘం మేనేజ్‌మెంట్ కమిటీ ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు మాట్లాడుతూ 15 రోజుల పాటు తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో 50 మంది బాలికలు పాల్గొన్నారని చెప్పారు. ఈ సందర్భంగా బాలికల సంరక్షణపై ముద్రించిన పోస్టర్‌ను విడుదల చేశారు. శిక్షణ పొందిన బాలికలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హిందూ యువజన సంఘం కార్యనిర్వాహ కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, శిక్షణ తరగతులు నిర్వహించిన ఆర్ వేణుగోపాల శ్రీనివాస్ ప్రసంగించగా, కమిటీ సభ్యులు ఎం సూర్యనారాయణ యాదవ్, జిల్లెళ్ల మూడి వరప్రసాదరావు, కె.సాంబశివరావు, ఎం మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి




ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన చేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

ఉంగుటూరు: ఉపాధి హామీ కూలీలకు పే స్లిపులు ఇవ్వాలని, పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని ప్రతి ఉపాధి హామీ కూలీకి కుటుంబానికి సంవత్సరానికి 200 రోజులు పనులు కల్పించాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉంగుటూరు మండలం కై కరంలో నందిభవాని ట్యాంకు వద్ద ఉపాధి కూలీలు పడుతున్న ఇబ్బందులు లోపాలను నాయకులు గుర్తించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు నిధులు తగ్గించి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని రక్షించేందుకు కూలీలంతా సంఘటితం కావాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీసం వేతనం ఉపాధిహామీ కూలీలకు రావడం లేదన్నారు. ఉపాధి కూలీలు ఆందోళన నిరసన కార్యక్రమంలో సీనియర్ సీపీయం నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కోర్ని అప్పారావు పాల్గొన్నారు.

## 'కరణం'కు నివాళులర్పించిన కొఠారు



విజయరాయిలో కరణం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొఠారు, ఇతర నాయకులు

పెదవేగి : కరణం లేని లోటు తీరనిదని వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొఠారు రామచంద్రరావు అన్నారు. పెదవేగి మండలం విజయరాయిలో వైఎస్సార్‌సీపీ నేత మంతెన కిషోర్ తండ్రి వెంకటేశ్వరరావు (కరణం) ఇటీవల మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కొఠారు రామచంద్రరావు శనివారం పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## పారా మిలటరీ బృందాలతో కవాతు

- శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు
- దెందులూరు ఎస్సై స్వామి



శ్రీరామవరంలో పారా మిలటరీ బృందాలు

దెందులూరు: ఏ గ్రామంలోనైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, హింసకు సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని దెందులూరు ఎస్సై కె. స్వామి అన్నారు. మండలంలో కొవ్వలి, శ్రీరామవరం, సోమవరప్పాడు, దెందులూరులో పారా మిలటరీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా కవాతు నిర్వహించామన్నారు. గ్రామాల్లో రౌడీషీటర్లు, చెడు నడత కలవారిపై నిఘా ఉందని, 144 సెక్షన్ తొలగించే వరకు ఇద్దరు, ముగ్గురు కంటే ఎక్కువ మంది ఏ ప్రాంతంలోనూ ఉండకూడదన్నారు. శాంతిభద్రతల అమలులో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై కె.స్వామి కోరారు.

## కాట్లంపూడి మురుగు సమస్య పరిష్కరిస్తాం

ఏలూరు రూరల్ : కాట్లంపూడి గ్రామంలో మురుగునీరు సమస్య పరిష్కరిస్తామని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి తెలిపారు. రెండురోజుల క్రితం కాట్లంపూడి ప్రధాన రోడ్డుపై మురుగునీరు నిలిచిపోయిందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. ప్రధానరోడ్డు పక్కన డ్రెయినేజీ లేకపోవడంతో స్థానికులు తమ ఇళ్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలు తవ్వుకోవాలని సూచించామని చెప్పారు. ఇళ్లలో మురుగునీరు రోడ్డుపైకి వదలవద్దని చెప్పామన్నారు. త్వరలో పంచాయతీ నిధులతో మురుగునీరు పారుదలకు పక్కా డ్రెయినేజీ నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు



గణపవరంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మహేశ్వరరావు

గణపవరం: నిర్ణీత కాలపట్టిక ప్రకారం క్రమం తప్పకుండా ప్రతీ ఒక్కరికీ వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన గణపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సరిపల్లెలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ వేచి ఉన్న తల్లులతో మాట్లాడారు. నిర్ణయించిన తేదీల్లో పిల్లలకు వ్యాక్సినేషన్ జరుగుతుందా అని ఆరా తీశారు. పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, అవి జీవితాంతం పిల్లలకు రక్షణగా ఉంటాయని తెలిపారు. అనంతరం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. సరిపల్లె వడ్డిపేట, ఎస్సీ కాలనీల్లో ఇళ్లకు వెళ్లి పిల్లలకు టీకాలు, వ్యాక్సిన్లు వేయించిందీ లేనిదీ ఆరా తీశారు. టీకాల కార్యక్రమం నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి, వైద్య సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వేసవి తీవ్రత దృష్ట్యా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామాల్లో మంచినీటిని క్లోరినేషన్ చేసిన తర్వాత మాత్రమే కుళాయిల ద్వారా సరఫరా చేసేలా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిర్వహించే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి బీపీ, షుగర్ పేషెంట్లను తప్పనిసరిగా తీసుకురావాలని ఏఎన్ఎంలు, ఆశా సిబ్బందికి సూచించారు. గర్భిణులను గుర్తించి వారికి పౌష్టికాహారంతోపాటు, ప్రతివారం వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు.ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సహాయకుడు యోహాన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# 50 శాతం రాయితీపై విత్తనాల పంపిణీ



నూజివీడు సీడ్స్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా

పెదవేగి : ప్రస్తుతం రైతాంగానికి పచ్చిరొట్ట పైరు విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్కే హబీబ్ బాషా తెలిపారు. పెదవేగి మండలం విజయరాయి రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్కే హబీబ్ బాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సంవత్సరం ముందుగానే విత్తనాలను అందుబాటులో ఉంచినందుకు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నూజివీడు సీడ్స్ ప్లాంట్‌ను తనిఖీ చేశారు. ప్రస్తుతం వరి విత్తనం ప్రాసెసింగ్‌లో ఉన్నందువల్ల దానికి సంబంధించిన లైసెన్స్, రిజిష్టర్స్, ఇన్‌వాయిస్‌లు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించాలని, అన్ని ప్రమాణాలను పాటించాలని రిజిష్టర్స్ సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఏడీఏ సుబ్బారావు, మండల వ్యవసాయాధికారిణి ప్రియాంక, విజయరాయి వీహెచ్ఏలు బషీర్, ప్రణీత్‌వర్మ రైతులు పాల్గొన్నారు.

# సీసీ ఫుటేజ్‌ల ద్వారా స్ట్రాంగ్ రూంల పరిశీలన



దెందులూరు స్ట్రాంగ్ రూంల వద్ద సీసీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్న జేసీ, ఆర్వో లావణ్యవేణి

దెందులూరు: స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ప్రతి విషయాన్ని నమోదు చేసేందుకు సీసీ కెమెరాలతో పాటు మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి అన్నారు. శనివారం దెందులూరు నియోజకవర్గ బ్యాలెట్ బాక్సుల ఉంచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజ్‌ను పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనుక్షణం విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను నిత్యం తనిఖీ చేయాలన్నారు. తనిఖీ అనంతరం ఆమె సందర్శకుల రిజిష్టర్‌లో సంతకం చేశారు. కేంద్ర పోలీస్ బలగాల గార్డును జిల్లా ఆర్మడ్ పోలీస్ గార్డు, సివిల్ పోలీస్ బందోబస్తులను ఆమె తనిఖీ చేశారు. అనధికారిక వ్యక్తులను స్ట్రాంగ్ రూమ్ ఉన్న ప్రాంతాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరాదన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్లు జితేంద్ర, వరహాలయ్య ఉన్నారు.

# చిన్నారుల సామూహిక పుస్తక పఠనం



భీమడోలు లైబ్రరీలో చిన్నారులకు పద్యాలను నేర్పుతున్న ఉమామహేశ్వరరావు

భీమడోలు: నీతి కథలను జీవితంలో అన్వయించుకుంటే భవిష్యత్తుకు బాటలు పడతాయని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరం పురస్కరించుకుని శనివారం ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణ తరగతుల్లో చిన్నారులు సామూహిక పుస్తక పఠనం చేసారు. పుస్తకాలు, దిన పత్రికలను చదివి వాటిపై సమీక్షలు రాసారు. వేమన పద్యాలు, శతక పద్యాలు చిన్నారులు లయబద్ధంగా పాడారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల చిన్నారులు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. చిన్నారులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు డీఎస్‌టీ అమర్‌నాథ్, జి.నాగమణి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిప్రకాష్

ఏలూరు (టూటౌన్): స్థానిక 9వ డివిజన్ ఫిల్‌హౌస్ పేటలో దళితసేన అనుబంధ సంఘం మహిళా చైతన్య సేన ఆధ్వర్యంలో మహిళా కుట్టు శిక్షణ కేంద్రాన్ని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు కాబోయే ప్రభుత్వం మహిళల అభివృద్ధి సంక్షేమం చూడాలని విజ్ఞప్తి చేశారు. మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు ఇవ్వాలని, వారి ఆర్థికాభివృద్ధికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా చైతన్య సేన రాష్ట్ర కార్యదర్శి బేతాళ జయసుధ, ఏలూరు నగర అధ్యక్షురాలు పిల్లి దుర్గ, ఉపాధ్యక్షురాలు మారుమూడి జయంతి, ప్రధాన కార్యదర్శి బల్లా దేవి, కార్యదర్శి పూనూరి బేబీ దుర్గా, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.